

అడవిలో జింకల సమూహం

డీకే అరుణకు మంత్రి పదవి?

- కేంద్ర కేబినెట్ కూర్పుపై పాలమూరు బీజేపీ నాయకుల్లో ఆసక్తి
- మహిళ, ఫైర్ బ్రాండ్ ముద్ర అరుణకు కలిసొచ్చే అవకాశం
- ఇప్పటికే రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం
- పార్టీలోనూ అనతికాలంలో జాతీయ ఉపాధ్యక్షురాలి స్థాయికి..
- గతంలో జిల్లా నుంచి ఒకరు.. జిల్లావాసి ఒకరికి మంత్రి పదవి
- రెండు బెర్తులు ఇస్తే కచ్చితంగా ఆమెకు రావొచ్చనే అభిప్రాయం



డీకే అరుణ

మహబూబ్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఐదేళ్లుగా బీజేపీ విస్తరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగే ప్రయత్నమూ చేస్తోంది. గత ప్రభుత్వంలో వచ్చిన ఉప ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి.. ఒకానొక దశలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా అవతరించిందని అనిపించింది. అనూహ్యంగా ఇక్కడ కాంగ్రెస్ పుంజుకుని.. అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ ప్రతిపక్షంగా మారింది. అయినప్పటికీ.. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఎనిమిది అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న బీజేపీ.. పార్లమెంట్ ఎన్నికల్లో 2019తో పోల్చితే మరో నాలుగు స్థానాలు అధికంగా గెలవడంతో సభ్యుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఇప్పుడు బీజేపీ ముందున్న లక్ష్యం వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని అధికారంలోకి తేవడమే. ఆ దిశగానే పార్టీ ఎత్తుగడలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఫైర్‌బ్రాండ్లతో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం రానున్న ఐదేళ్ల పాటు చేయనుంది. ఇప్పటికే ఒక్క పార్లమెంట్ సీటు సాధించకపోవడంతో బీఆర్ఎస్ పూర్తిగా చతికిలపడిపోయింది. ఈక్రమంలో కేంద్ర కేబినెట్‌లో ఎవరెవరికి మంత్రి పదవులు వస్తాయనే విషయం చాలా కీలకంగా మారింది. భవిష్యత్ ప్రణాళికల ప్రకారమే.. అటు పార్టీని నడిపించడంతోపాటు.. ఇటు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడానికి ఎవరు ఉపయోగపడతారనే విషయంలో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ నుంచి గెలుపొందిన ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేరు ప్రస్తావనకు వస్తోంది. ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ ఆదివారం మూడోసారి ప్రమాణస్వీకారం చేయబోతున్న క్రమంలో డీకే అరుణకు కచ్చితంగా కేబినెట్ బెర్తు వస్తుందని పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు.

ఫైర్‌బ్రాండ్ పేరు కలిసొచ్చే అవకాశం..

డీకే అరుణకు దాదాపు మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. 1996లో మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేసి.. రాజకీయ అరంగేట్రం చేసిన ఆమె.. 2004, 2009, 2014లో గద్వాల నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిచారు. 2018లో ఓటమి చెందారు. 2019లోనూ ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. ఈ 2024 ఎన్నికల్లో.. హోరాహోరీ పోరులో.. సీఎం సొంత నియోజకవర్గంలో బీజేపీ తరపున గెలిచారు. రాష్ట్రంలో గెలిచిన మహిళా ఎంపీ అరుణ ఒక్కరే. ఆమె రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లలో రాష్ట్ర మంత్రిగా పని చేశారు. మంత్రిగా ఉన్న సమయం నుంచి అరుణ ఫైర్‌బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. గత కేంద్ర కేబినెట్‌లో కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉండగా.. అంతకుముందు బండారు దత్తాత్రేయ ఉన్నారు. ఈసారి ఎంపీలు ఎక్కువగా సాధించిన నేపథ్యంలో రాష్ట్రానికి రెండు కేబినెట్ బెర్తులు వస్తాయని ఆశిస్తున్నారు. ఒకవేళ కేబినెట్ బెర్తులు రెండు రాకపోయినా.. ఒకటి సహాయమంత్రి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కచ్చితంగా మహిళా కోటాలో అరుణకు కేబినెట్ బెర్త్ ఖాయమని పార్టీ నాయకులు భావిస్తున్నారు. గత కేబినెట్‌లో స్మృతి ఇరానీ ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారు. కానీ ఈసారి ఆమె ఓటమి చెందడంతో అరుణకు అవకాశం వస్తుందనే అభిప్రాయం వస్తోంది. గతంలో కాంగ్రెస్‌లో పని చేసిన డీకే అరుణ.. 2018లో ఓటమి తర్వాత బీజేపీలో చేరారు. అందులో చేరిన అనతికాలంలోనే బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిని సాధించగలిగారు. ఇప్పుడు కూడా తనకు జాతీయ స్థాయిలో ఉన్న సంబంధాలతో మంత్రి పదవికి దక్కవచ్చనే చర్చ జరుగుతోంది.

సుదీర్ఘ రాజకీయ అనుభవం..

డీకే అరుణ పుట్టినిల్లు, మెట్టినిల్లు రెండు కుటుంబాలకూ సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉంది. తండ్రి చిట్టెం నర్సిరెడ్డి, మామ డీకే సత్యారెడ్డి ఇద్దరూ ఎమ్మెల్యేలుగా పని చేసినవారే. అలాగే తన భర్త భరతసింహారెడ్డి కూడా ఒకసారి ఎమ్మెల్యేగా పని చేశారు. ఆమె మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనకు కేడర్, వర్గం అంటూ ఉంది. భవిష్యత్‌లో రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ అధికారం చేపట్టాలంటే.. కచ్చితంగా ఫైర్‌బ్రాండ్ అవసరం ఉంటుంది. గతంలో నాలుగు ఎంపీలు గెలిస్తే.. ఒక మంత్రి పదవి రాగా.. ఇప్పుడు ఎనిమిది ఎంపీ స్థానాలు గెలవడంతో రెండు పదవులు ఖాయమనే అభిప్రాయం ఉంది. గతంలో పాలమూరు నుంచి మల్లికార్జున్‌గౌడ్ కేంద్ర రైల్వే సహాయ మంత్రిగా పని చేశారు. మెదక్ జిల్లాకు చెందిన ఆయన ఇక్కడ నుంచి నాలుగుసార్లు గెలవగా.. ఇక్కడి నుంచే కేంద్ర కేబినెట్‌లో ప్రవేశం పొందారు. అలాగే ఈ ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్ జైపాల్‌రెడ్డి కూడా కేంద్రమంత్రిగా చేసినప్పటికీ.. చేవెళ్ల, మిర్యాలగూడ స్థానాల నుంచి గెలిచినప్పుడు ఆయనకు కేంద్ర మంత్రి పదవులు వరించాయి. అలా పాలమూరు నుంచి ఒకరు.. పాలమూరు వాసి ఒకరు కేంద్రమంత్రి పదవులు అనుభవించారు. డీకే అరుణకు మంత్రి పదవి వస్తే.. మూడోసారి కేంద్రమంత్రి పదవి పాలమూరును వరిస్తుందని చెప్పొచ్చు. కేంద్ర కేబినెట్‌లో పాలమూరు ఎంపీ ఉండటం ద్వారా వెనుకబడిన ఈ ప్రాంతంలో అభివృద్ధి ఎక్కువగా జరుగుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.



ఆకుపచ్చగా మారిన నల్లమల అడవి



అడవి మధ్యలోని రసూల్ చెరువుకు చేరిన నీరు


ఆకుపచ్చ నల్లమల

- తొలకరి వర్షాలతో శోభాయమానంగా అడవి
- వన్యప్రాణులకు మండుటెండలు, కార్చిచ్చు నుంచి విముక్తి
- టైగర్ సఫారీకి పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

మన్ననూర్, జూన్ 8: ఇటీవల కురిసిన తొలకరి వర్షాలకు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లోని నల్లమల పచ్చగా మారింది. వేసవి మొదలైనప్పటి నుంచి అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో కార్చిర్చు ఏర్పడి వందలాది హెక్టార్లలో అడవి అగ్నికి ఆహుతైంది. మే చివరి వారం నుంచే వర్షాలు కురవడంతో అడవంతా ఆకుపచ్చగా మారింది. వేసవి తాపానికి, కార్చిచ్చు మంటలకు చెల్లాచెదురైన పెద్ద పులులు, చిరుతలతో పాటు జింకలు, దుప్పులు, సాంబార్లు, మనుబోతులు, ఎలుగుబంట్లు, అడవి రేసు కుక్కలు, ఇతర పక్షులు అన్నీ చెల్లా చెదురవ్వగా.. ప్రస్తుత వర్షాలకు అడవి చల్లగా, పచ్చగా మారడంతో వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. వన్యప్రాణులకు జీవనాధారమైన రసూల్ చెరువు, పిచ్చకుంట్లోని చెరువులోకి నీరు చేరింది. నల్లమల శోభాయమానంగా మారడంతో వేసవి సెలవుల చివరి దశలో హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు టైగర్ సఫారీ టూర్‌కు అధికంగా వస్తున్నారు.



ఫర్హాబాద్ వ్యూ పాయింట్



అడవిలో పరుగెడుతున్న జింక



సఫారీ వాహనాలు




నీరు చేరిన పిచ్చకుంట్లోని చెరువు



టైగర్ సఫారీ టూర్‌కు వస్తున్న పర్యాటకులు



కృష్ణానదికి చేరిన వరద జలాలు



సంగమేశ్వరాలయం భీమలింగం సమీపంలోకి చేరుతున్న వరద జలాలు

కృష్ణానదికి వరద

కొల్లాపూర్, జూన్ 8: నైరుతి పవనాల రాకతో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద జలాలు కృష్ణానదికి చేరుతున్నాయి. దాంతో నదిలో స్వల్పంగా వరద పెరుగుతోంది. కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద కృష్ణానది అవతలి ఒడ్డున ఉన్న సప్తనదుల ఆలయం సంగమేశ్వరం వద్ద రెండు అడుగుల మేర జలాలు పెరిగాయి. సంగమేశ్వరం ఆలయం సమీపంలో ఉన్న భీమలింగం సమీపానికి శనివారం సాయంత్రం వరద నీరు చేరింది. ఈ ఏడాది ఆలయాన్ని దర్శించే భక్తులకు భీమలింగం దర్శనం ఉండదని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్యశర్మ తెలిపారు. ఈ ఏడాది గతేడాది కంటే ముందుగానే వరద జలాలు నదికి చేరుకోనున్నాయి. మృగశిర కార్తె ప్రారంభం నాటికే వరద జలాలు చేరడంతో కొల్లాపూర్ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సోమశిల సోమేశ్వర ఆలయాన్ని తాకిన వరద నీరు

పశువుల కోసం ఒకరు.. గొర్రెల మందతో మరొకరు


- మూగ జీవాలను కాపాడుకునే క్రమంలో పిడుగుపాటుకు గురై ఇద్దరి మృతి



బోయ రాజు, రాజు(ఫైల్)

గద్వాల/కోయిలకొండ, జూన్ 8 : ఉరుములు మెరుపులతో కూడిన వర్షం నుంచి మూగ జీవాలను కాపాడుకునే క్రమంలో ఇద్దరు పిడుగుపాటుకు గురై మృతి చెందారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రెండు వేర్వేరుచోట్ల ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పట్టణంలో ఇళ్లలో ఉన్న ప్రజలే వాటి ధాటికి భయపడిపోయారు. వ్యవసాయ పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు వాటి భయానికి ఇంటిబాటపట్టారు. కానీ, గద్వాల మండలం గుంటిపల్లి గ్రామానికి చెందిన రైతు బోయ రాజు (23) తన పశువులను ఒకచోటికి చేర్చి పొలంలోనే కట్టేసి ఇంటికి బయలుదేరే సమయంలో పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. అప్పటికే ఆయన భార్య సంధ్య, వ్యవసాయ పనుల కోసం వచ్చిన ట్రాక్టర్‌లో ఇళ్లకు వెళ్లారు. పశువులను కట్టేసి వస్తానని చెప్పిన భర్త రాత్రి 9 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో గ్రామంలో ఎక్కడైనా ఉన్నాడేమోనని భార్య వెతికింది. ఎక్కడ కూడా లేకపోవడంతో పది మంది గ్రామస్థుల సహాయంతో పొలంలో వెతికారు. పొలంలో పిడుగుపాటుకు గురై విగతజీవిగా పడిఉండటాన్ని రాత్రి 11 గంటల సమయంలో గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన గొర్రెలకాపరి బాయిగడ్డ రాజు (39) శుక్రవారం రాత్రి పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. సాయంత్రం నుంచి ఉరుములతో కూడిన వర్షం పడటంతో గొర్రెలను నల్లవెల్లి గ్రామ సమీపానికి తీసుకువచ్చి వర్షంలోనే ఉన్నాడు. ఉరుములు, గాలివాన రావడంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు ఏర్పాట్లు



గద్వాల ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

- ఉమ్మడి జిల్లాలో 86 కేంద్రాల ఏర్పాటు
- పరీక్షకు హాజరుకానున్న 30,496 మంది అభ్యర్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 8: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నిర్వహించే ఈ పరీక్షకు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 86 కేంద్రాల్లో 30,496 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓఎంఆర్ విధానంలో ఈ పరీక్ష ఉంటుంది. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. కేంద్రం పరిధిలో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిరాక్స్ సెంటర్స్ మూసి ఉంచాలని అధికారులు ఆదేశించారు. అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఇప్పటికే సూచించారు. సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోరని చెప్పారు. అభ్యర్థులు తప్పని సరిగా బ్లాక్, బ్లూ బాల్ పెన్, కొత్తవి మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, హాల్ టికెట్‌తోపాటు ఆధార్ లేదా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 36 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 15,199 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వనపర్తి జిల్లాలో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో వనపర్తి జిల్లా కేంద్రంలో 15, కొత్తకోటలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ 4,843 మంది అభ్యర్థులు పరీక్షకు రాయనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 18 కేంద్రాల్లో 5,221 మంది, జోగుళాంబ గద్వాల జిల్లాలో 14 కేంద్రాల్లో 5,233 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు.

ఘనంగా మృగశిర

- జోరుగా నాటుకోళ్లు, చేపల విక్రయాలు
- గతంకంటే అధిక ధరలకు అమ్మకం

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 8: మృగశిర అంటే చేపలు, నాటుకోళ్లు గుర్తుకు వస్తాయి. ఈ కార్తె రోజు చేపలు, నాటుకోళ్ల వంటకాలు తినడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా శనివారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో చేపలు, నాటుకోళ్ల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. వ్యాపారులు వివిధ చెరువుల్లో పట్టిన చేపలను తెచ్చి, విక్రయించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కొర్రమీను చేపలను తెచ్చి పాలమూరులో విక్రయించారు. పట్టణంలోని మార్కెట్‌లతో పాటు భగీరథకాలనీ, వీరన్నపేట, పద్మావతి కాలనీలో రహదారుల పక్కన చేపలను అమ్మారు. శనివారం కావడంతో విక్రయాలు కాస్త తగ్గినా, ఆదివారం విక్రయాలు పెరిగే అవకాశం ఉంది. మామూలు రోజుల్లో బొచ్చ, బంగారుతీగ, రౌట ధర కిలో రూ.160 ఉండగా శనివారం మృగశిర కార్తె సందర్భంగా రూ.180 నుంచి రూ.200 వరకు విక్రయించారు. కొర్రమీను కిలో రూ.600కుపైగానే అమ్మారు. ఇక నాటుకోళ్లను మార్కెట్‌లతో పాటు, పలు చికెన్ సెంటర్లలో పెద్ద ఎత్తున అమ్మారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోనూ చేపలు, మటన్, చికెన్ దుకాణాల వద్ద జనం రద్దీ కనిపించింది. పట్టణంలోని రైతుబజారులో శనివారం తెల్లవారుజాము నుంచే చేపల విక్రయాలు జరిగాయి. కార్తెను దృష్టిలో పెట్టుకుని రోజువారి ధరల కన్నా రూ.30 నుంచి రూ.50 అదనంగా అమ్మకాలు చేశారు.



మహబూబ్‌నగర్‌లో విక్రయానికి ఉంచిన చేపలు



చేపను కట్ చేస్తున్న వ్యాపారి



నాగర్‌కర్నూల్‌లో చేపలను కొంటున్న ప్రజలు

బీఆర్ఎస్‌కు కౌన్సిలర్ రాజీనామా

» మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

అచ్చంపేట టౌన్, జూన్ 8 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మునిసిపాలిటీలోని రెండో వార్డు కౌన్సిలర్ సుంకరి నిర్మల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆమెతో పాటు పట్టణానికి చెందిన యువకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పట్టణాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘు, మహేష్ తదితరులున్నారు.



మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్, బీఆర్ఎస్ కార్యకర్తలు

రైలులో నుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

మానవపాడు, జూన్ 8 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం రైల్వేగేట్ సమీపంలో శనివారం ఉదయం లోకల్ రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి అందులో నుంచి కింద పడి గాయాల పాలయ్యాడు. రైల్వే కర్నూల్ ఆర్‌పీఎఫ్ ఎస్సై ప్రేమ్‌కుమార్, గద్వాల జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రైలులో నుంచి కింద పడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రం మామల్పురానికి చెందిన పన్నీరుసెల్వం(45)గా అతని స్నేహితుడైన శామ్యూల్ ద్వారా తెలిసిందని చెప్పారు. బాధితుడిని 108లో కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

బతుకులతో బెట్టింగ్

» అప్పుల పాలై ఒకరి ఆత్మహత్యాయత్నం » ఊరొదిలి పారిపోయిన ఉపాధ్యాయుడు

గద్వాల క్రైం, జూన్ 8 : బెట్టింగ్ భూతం బతుకులను బలి తీసుకుంటోంది. సులభంగా డబ్బు సంపాదించాలన్న అత్యాశతో పలువురు బెట్టింగ్ బాట పడుతున్నారు. అప్పులు చేసి మరీ పందేలు కాసి లక్షల రూపాయలు నష్టపోతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. మరికొందరు ఊరు వదిలి పారిపోతున్నారు. కొందరు యువకులు దొంగతనాలకు పాల్పడి జైలు పాలవుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతంలో క్రికెట్ బెట్టింగ్‌లతో ఓ వ్యక్తి లక్షల రూపాయలు నష్టపోయాడు. అందుకోసం తీసుకున్న అప్పులు, వడ్డీలు కట్టలేక దొంగగా మారి జైలుకు వెళ్లాడు. అలాగే కొందరు ఉపాధ్యాయులు కూడా ఈజీ మనీ ఆశతో బెట్టింగ్ భూతానికి బలై ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే.

జిల్లాలో పలువురు బాధితులు

కొందరు బుకీలు రాత్రికి రాత్రి కోట్ల రూపాయలు సంపాదించొచ్చని ఆశ పెట్టి బెట్టింగ్ ఆటలో పలువురిని పావులుగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌లకు అలవాటు పడ్డ ఓ ఉపాధ్యాయుడు మూడు కోట్ల రూపాయలు నష్టపోయి గద్వాల నుంచి పారిపోయాడు. మరో ఉపాధ్యాయుడు రూ.70 లక్షల అప్పు చేసి, తీర్చలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ధరూర్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు కూడా బెట్టింగ్‌లో లక్షలు పోగొట్టుకున్నట్లు తెలిసింది. అదే మండలంలో మరో వ్యక్తి అప్పులు పాలై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన వ్యక్తి బెట్టింగ్‌లతో దాదాపు రెండు కోట్ల రూపాయలు అప్పుల పాలయ్యాడు. అప్పులకు వడ్డీ కట్టలేక, తీర్చలేక ఇటీవలే తన ప్లాటును కూడా రూ.13 లక్షలకు రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. మిగతా అప్పు తీర్చాలంటూ రుణదాతల నుంచి ఒత్తిడి అధికం కావడంతో వారంరోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రస్తుతం అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై బెట్టింగ్ నిర్వాహకులు వారిని బెదిరించి ఎవరికీ సమాచారం ఇవ్వొద్దని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అలాగే గట్టు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బెట్టింగ్ వ్యసనంతో అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చలేక కుటుంబం సహా గ్రామం వదిలి వెళ్లిపోయినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో బెట్టింగ్‌లకు సూత్రధారులుగా ఉన్న నలుగురిపై గతనెల 20న పోలీసులు కేసు నమోదు చేశారు. వీరితో ఇతర పాత్రధారులు, సూత్రధారులు ఎవరనే విషయంపై విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

బాధితులు వివరాలు వెల్లడించాలి



బెట్టింగ్‌లతో నష్టపోయిన బాధితులు తమకు సహకరించి వివరాలు వెల్లడిస్తే, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్‌లతో ఎంతో మంది జీవితాలు నాశనం అవుతున్నాయి. వాటి జోలికి పోయి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. విద్యార్థులు చదువుపై, యువకులు ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి, ఉన్నత స్థాయికి ఎదగాలి. బెట్టింగ్ భూతాన్ని కూకటి వేళ్లతో సహా పెకలించేందుకు కృషి చేస్తాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

- రితిరాజ్, ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీశైలం (ఫైల్)

కొల్లాపూర్, జూన్ 8 : ఉద్యోగరీత్యా విధుల్లోకి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లాపూర్ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన గోపాలం కుమారుడు శ్రీశైలం(30) వనపర్తి జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం విధులు ముగించుకుని వనపర్తి నుంచి బైక్‌పై కొల్లాపూర్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. కొల్లాపూర్ మండల పరిధిలోని మాచినేనిపల్లి గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడడంతో పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ శ్రీశైలం తలకు తగలడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. అటుగా వచ్చే యువకులు బైకుపై శ్రీశైలంను కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా అప్పటికే మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మృతునికి వివాహం కాలేదు. ఇటీవలే తండ్రి గోపాలం కూడా మరణించాడు. శ్రీశైలం అకాల మరణంతో కాలనీవాసులు, మిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాపై కసరత్తు



సీనియార్టీ జాబితా తదితర వివరాలను పరిశీలిస్తున్న డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 8 : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. సీనియార్టీ జాబితా సిద్ధం చేసి పాయింట్ల వివరాలను సేకరిస్తున్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల వివరాలను, చనిపోయిన ఉపాధ్యాయుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఈ తతంగమంతా పూర్తి చేసిన తర్వాత పాయింట్ల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు. మొత్తం వివరాలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు అందజేయనున్నారు. జాబితా విడుదల చేసిన అనంతరం అభ్యంతరాలు ఉంటే ఈనెల 10, 11 తేదీల్లో టీచర్ల నుంచి స్వీకరిస్తారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 1500 మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ కోరుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా బదిలీల కోసం పలువురు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. పదోన్నతులను సీనియార్టీ, రోస్టర్ ఆధారంగా కల్పించనున్నారు. మొదట స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్‌ఎం, ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు పదోన్నతులు కల్పిస్తారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో పదోన్నతులు, బదిలీలకు సంబంధించి డీఈవో రవీందర్, సూపరింటెండెంట్, కార్యాలయ సిబ్బంది, సెక్టోరియల్ అధికారులు వివరాలను పరిశీలిస్తున్నారు.

ఎనుకుంట కాలువలో పడి వ్యక్తి మృతి

కొత్తకోట, జూన్ 8 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని ఎనుకుంట రిజర్వాయర్ కాలువలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణానికి చెందిన ఇస్మాయిల్(74) కనిమెట్ట సమీపంలోని ఓ దాబాలో వర్కర్‌గా పని చేస్తున్నాడు. అనారోగ్యం బారిన అతను రెండురోజుల క్రితం వనపర్తికి వెళ్లిపోయాడు. అయితే, ఇస్మాయిల్ ఇంటికి రాకపోవడంతో బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఎనుకుంట రిజర్వాయర్ కాలువలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడన్న విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో గుర్తించిన బంధువులు తమను ఆశ్రయించినట్లు ఎస్సై వివరించారు. ఇస్మాయిల్ కుమారుడు ఇబ్రహీం శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని కాలువ నీటి నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గొర్రె పిల్లలపై వీధి కుక్కల దాడి

» 33 గొర్రె పిల్లల మృతి

అలంపూర్ చౌరస్తా, జూన్ 8 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులోని పంట పొలాల్లో ఆగి ఉన్న గొర్రెపిల్లల మందపై వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో పుల్లూరు గ్రామానికి చెందిన గొల్ల గోవింద్, వెంకటేశ్వర్లు, రాజు, మల్లికార్జునకు సంబంధించిన 33 గొర్రె పిల్లలు మృతి చెందాయి. సుమారు రూ.రెండు లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

హన్వాడ, జూన్ 8 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్పల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. గ్రామంలోని రైతు అంజయ్య శనివారం తన గేదెలను మేపుతుండగా ఓ వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

జూరాల జల విద్యుత్ కేంద్రంలో చోరీ

» కాపర్, ఇనుప సామగ్రి అపహరణ

ఆత్మకూరు, జూన్ 8 : వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామ పరిసర ప్రాంతంలో గల లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ కేంద్రంలోని చివరన ఉన్న స్టోర్ రూమ్‌లో ఈనెల 6వ తేదీన రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.95 వేల విలువ గల సామగ్రిని ఎత్తుకెళ్లారు. జల విద్యుత్ ఉత్పత్తి ఏఈ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు.

మానవతావాదులు ముందుకు రావాలి

» హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రయ్య
» పొల్కంపల్లిలో కంటి వైద్య శిబిరం ప్రారంభం



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రయ్య

వంగూరు, జూన్ 8 : సమాజానికి ఉపయోగపడే మంచి పనులకు స్వచ్ఛంద సంస్థలు, మానవతా వాదులంతా కలిసి ముందుకు రావాలని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రయ్య అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం పొల్కంపల్లి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై, చీమర్ల, బీరం వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆధునిక సౌకర్యాలతో వారంరోజుల పాటు శిబిరం నిర్వహిస్తారని, కంటి సంబంధిత వ్యాధులు ఉన్నవారు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిబిరాన్ని ఏర్పాటుచేసిన చీమర్ల నరేందర్‌రెడ్డి, బీరం శ్రీకాంత్‌రెడ్డిలను ఆయన అభినందించారు. కార్యక్రమానికి వచ్చిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, కిన్నెర కళాకారుడు మొగులయ్యను హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రయ్య, ఈఎన్‌సీ గణపతిరెడ్డి, రిటైర్డ్ ఉన్నత అధికారి జనార్దన్‌రెడ్డిలు శాలువాతో సన్మానించారు. కార్యక్ర మంలో ప్రముఖులు మాధవరెడ్డి, ఆకుల శ్రీని వాసులు, నారాయణరెడ్డి, రాధకృష్ణారెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నర్సింహ, పరుశరాములు, కంటి వైద్యులు పాల్గొన్నారు.

రెండో రోజు జోరుగా వర్షాలు

» పుల్లూరులో 54.5 మి.మీ. వర్షం
» ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

గద్వాల, జూన్ 8 : జోగుళాంబ గద్వాల జిల్లాలో శనివారం జోరుగా వర్షం కురిసింది. శుక్రవారం జిల్లాలోని ఉండవెల్లి మండలం పుల్లూరులో 54.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆ ప్రాంతంలోనే కుండపోతగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. గ్రామంలోని ఇళ్లల్లోకి వర్షపు నీళ్లు చేరాయి. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ఇటిక్యాల మండలం బీచుపల్లిలో కూడా జోరుగా వర్షం కురిసింది. ఇక్కడ 32.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అయిజలో 29.3, ఉండవెల్లిలో 21.8, వడ్డేపల్లిలో 14, గద్వాలలో 13.8, ధరూర్‌లో 10 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో గద్వాల మండలం గుంటిపల్లి గ్రామంలో పిడుగుపడి యువ రైతు బోయ రాజు(23) మృతి చెందాడు. శనివారం కూడా వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన తర్వాత వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూమిలో వేడిమి తగ్గి తేమ శాతం పెరుగుతుండటంతో రైతులు విత్తనాలు విత్తేందుకు సిద్ధం అవుతున్నారు. కొందరు రైతులు పొలాలను దున్నుతుండగా.. మరికొందరు విత్తనాలు విత్తుతున్నారు.

మన్ననూర్‌లో...

మన్ననూర్ : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు పరిసర గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా మన్ననూరు గ్రామంలోని పలు కాలనీల్లో నీరు నిలవడంతో పాదచారులు ఇబ్బంది పడ్డా రు. మూడురోజులుగా వరుసగా వర్షాలు కురుస్తూ ఉండడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. నల్లమల ప్రాంతంలోని ఫర్హాబాద్, గుండం, కొల్లం పెంట పరిధిలో గల నీటి గుంటల్లోకి వర్షపు నీరు చేరడంతో వన్యప్రాణులకు తాగునీటి వనరులు ఏర్పడ్డాయి. వటవర్లపల్లి గ్రామ పరిధిలోని కాను గుల చెరువులోకి భారీగా వర్షపు నీరు చేరడంతో అలుగు పారింది. మండలంలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



పుల్లూరు గ్రామంలో రోడ్లపై పారుతున్న వరద

జాతీయ రహదారిపై కారు దగ్ధం

కొత్తకోట, జూన్ 8 : జాతీయ రహదారి పాలెం బ్రిడ్జిపై కారు దగ్ధమైన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్‌కు చెందిన పుల్లయ్య, సురేష్, వెంకటేశ్వర్‌రావులు హైదరాబాద్‌లో పని చూసుకొని తిరిగి కర్నూల్‌కు వస్తుండగా కారులో మంటలు వచ్చాయి. మంటలను గమనించిన ముగ్గురు కారును పక్కకు ఆపి దిగేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. కారు పూర్తిగా బూడిదైంది. కారులో మంటలు రావడంతో రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధాశ్రమాల అవసరం లేకుండా చూడాలి

» మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం కన్వీనర్ అవిటి నాగశ్రీ

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 8 : వృద్ధులైన తల్లిదండ్రులను తమ పిల్లలు బాధ్యతగా బాగోగులు చూసుకునేలా అవగాహన కల్పించి వృద్ధాశ్రమాల అవసరం లేకుండా చూడాలని మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం కన్వీనర్ అవిటి నాగశ్రీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పారిశ్రామిక వాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో శనివారం జరిగిన మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటి సమాజంలో తల్లిదండ్రుల పేరు మీద ఉన్న ఆస్తిపాస్తులను పిల్లలు తమ పేర రాయించుకొని వారిని రోడ్డు పాలు చేస్తున్నారని, ఎంతో మంది వృద్ధులు తమ బాధలను వెళ్లగక్కుకోలేక దిగమింగి బతుకు లీడుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వయోవృద్ధుల రక్షణ కోసం రూపొందించిన 2007 చట్టాన్ని కఠినంగా అమలు పరిచి ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఊర్మిళాదేవి, చంద్రకళ, ఇందిర, సీనియర్ సిటిజన్ ఫోరం గౌరవాధ్యక్షుడు అక్కినేని నారాయణరావు, అధ్యక్షుడు జగపతిరావు, ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, మహిళలు పాల్గొన్నారు.



మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్ ఫోరం కన్వీనర్ నాగశ్రీ

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని మండల వనరుల కేంద్రం

ఊర్కొండ, జూన్ 8: ఊర్కొండలో మండల వనరుల కేంద్ర భవనం నిర్మించారు.. వదిలేశారు. దాంతో గ్రామ చివరన ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలతో పాటు మద్యం ప్రియులకు నిలయంగా మారింది. ఆలానా పాలన లేకపోవడంతో పాడుబడిన భవనంగా కనిపిస్తుంది. మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాలు లేక ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిర్మించిన ఒకే ఒక భవనం ప్రారంభించక పోవడంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలో మండల విద్యాధికారి కార్యాలయం, సిబ్బంది ఉండటంతో పాటు ఉపాధ్యాయుల సమావేశాలు, విద్యాబోధన తీరుతెన్నులపై చర్చించాల్సిన మండల వనరుల కేంద్ర భవనం ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుతుండటంతో మేధావులు, మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మూడు సంవత్సరాల క్రితమే భవన నిర్మాణం పూర్తి అయిన గత పాలకులు ప్రారంభించకపోవడంతోనే ఇలాంటి దుస్థితి కలిగిందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు.

మండల వనరుల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేయాలని మండల అధికారులు కోరుతున్నారు. ఇన్‌చార్జి మండల విద్యాధికారిగా కొనసాగుతున్నందున కల్వకుర్తిలోనే వారి విధులు నిర్వర్తించాల్సి వస్తుండటంతో ఊర్కొండలోని మండల వనరుల కేంద్రం భవనాన్ని ఎంపీడీవో కార్యాలయానికి కేటాయిస్తే బాగుంటుందని అధికారులు మండల ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత ఉన్నత అధికారులు మండల వనరుల కేంద్రాన్ని ఎంపీడీవో కార్యాలయంగా మార్చి, శిథిలావస్థకు చేరుతున్న భవనాన్ని కాపాడాలని పలువురు కోరతున్నారు.



ఊర్కొండలో ప్రారంభానికి నోచుకోని మండల వనరుల కేంద్రం

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా...

మండల వనరుల కేంద్ర భవనాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంగా మార్చాలి. భవన నిర్మాణం పూర్తయిన ప్రారంభించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతుంది. మండల విద్యాధికారి ఇన్‌చార్జిగా ఉండటంతో సిబ్బంది కూడా ఉండటం లేదు. భవనం శిథిలావస్థకు చేరకుండా ఉండాలంటే ఎంపీడీవో కార్యాలయంగా మార్చాలి

- కంఠం యాదయ్య, మాజీ ఉప-సర్పంచ్, ఊర్కొండ



శిథిలావస్థలో పాఠశాల

- ప్రమాదపు అంచున విద్యార్థులు
- భయాందోళనలో తల్లిదండ్రులు

పెంట్లవెల్లి, జూన్ 8 : పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు ప్రతీ ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తామని పాలకులు చెబుతున్నారు. కానీ శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో విద్యార్థులు భయపడుతూ గడపాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎప్పుడు కూలుతాయోనని చిన్నారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 230మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న పాఠశాలకు విద్యార్థులను పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. ఎప్పుడు పెచ్చులూడి మీద పడి ప్రమాదాలు జరుగుతాయోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. శిథిలావస్థకు చేరిన గదుల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన తరగతి గదులు

ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతూ ఇనుప చువ్వలు తేలి ప్రమాద భరితంగా ఉంది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం పడినా గదుల నిండా నీరు చేరుతోంది. కూర్చొని చదువుకోవాలంటే ఎప్పుడు పెచ్చులూడి మీద పడతాయోనని విద్యార్థులు భయపడుతున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఈనెల 12 ప్రారంభం కాబోతున్నది. మరి ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన భవనం నిర్మించాలని వారు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన బాలుర ఉన్నత పాఠశాల భవనం

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం జరగనున్న గ్రూప్-1 పరీక్ష సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న 18 పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల దగ్గర జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు గాని ఇతర వేరే షాపులను కూడా మూయించడం జరుగుతుందన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం దగ్గర ఐదుగురు పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని, బయోమెట్రిక్ కూడా ఉంటుందన్నారు. కావున పరీక్ష రాసే విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రాల దగ్గరికి వచ్చిన వాళ్ల పరీక్ష కేంద్రాల్లో వెళ్లాల్సిందిగా తెలిపారు. నిమిషం ఆలస్యం అయినా లోనికి పంపడానికి వీలు లేదని హాల్ టికెట్, ఐడీ కార్డు అన్ని జాగ్రత్తగా చూసుకుని పరీక్ష కేంద్రాలకు రావాల్సిందిగా తెలిపారు. మీ పరీక్ష కేంద్రాల ఏరియాకు మీకు తెలియకుంటే నాగర్‌కర్నూల్ బస్టాండ్ దగ్గర యూనిఫామ్‌లో మూడు టీమ్‌లు ఆరుగురు పోలీసులు ఉంటారన్నారు. వారిని పరీక్ష కేంద్రాల అడ్రస్ అడిగి తెలుసుకుని మీ పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సిందిగా ఎస్పీ తెలిపారు. ఏదైనా అనివార్య కారణాల వల్ల ఆలస్యమైతే బస్టాండ్ దగ్గర నుంచి అక్కడ ఉన్న సిబ్బంది పోలీస్ వాహనాలలో విద్యార్థులను పరీక్ష కేంద్రాల దగ్గర చేరుస్తారని ఎస్పీ తెలిపారు.

ఏర్పాట్లు సిద్ధం

తెలకపల్లి: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు సెంటర్ల నిర్వాహకులు శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల సెంటర్‌లో 288 మంది, గోవర్ధన్ రెడ్డి డిగ్రీ కళాశాలలో 312 మంది మొత్తం రెండు సెంటర్లలో 600 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు వారు తెలిపారు. ఈ రెండు సెంటర్లలోని ఇన్విజిలేటర్లకు సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు చేసినట్లు వారు తెలిపారు. పరీక్ష నిర్వహణ ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఉదయం 9గంటలకు పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలని వారు తెలిపారు. ఆయా సెంటర్ల చీఫ్ సూపరిటెండెంట్‌లు, నిర్వాహకులు తిరుపతయ్య, వి.రాజమహేందర్‌రెడ్డి, ఎం.ప్రకాశ్‌రెడ్డి, ఎస్.సందీప్‌కుమార్, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.



గోవర్ధన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో ఇన్విజిలేటర్లకు సూచనలు చేస్తున్న పరీక్ష నిర్వాహకులు

ఆశ్రమంలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 8: జిల్లా కేంద్రంలోని జ్ఞానేశ్వర వాత్సల్య మందిరం, జ్ఞాన సరాస్వతి బల కళ్యాణ్ మందిర్ ఆశ్రమ అనాధ విద్యార్థులకు మాన్‌కైండ్ ఫార్మా సహకారంతో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాద విద్యార్థులకు విద్యనందిస్తున్న వాత్సల్య మందిరం సేవలు అభినందనీయమన్నారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసంలో తోడ్పాటు అందించేందుకు ఆశ్రమంలోని విద్యార్థులందరికి బ్యాగులతో పాటు లంచ్ బాక్స్, వాటర్ బాటిల్స్ రైటింగ్ ప్యాడులు పంపిణీ చేశారమని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీధర్, మ్యాన్‌కైండ్ ఫార్మా మేనేజరు రాజ్‌కుమార్, శివకుమార్, సాయిబాబు, కొట్ర బలరాముడు, సుదర్శన్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు అమలు చేయాలి

పెద్దకొత్తపల్లి, జూన్ 8 : విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఆన్‌లైన్‌లో ఉచిత అడ్మిషన్లు అమలు చేయాలని తెలంగాణ జానపద కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు జోగుజ్యోతి శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని ఎంఈవో కార్యాలయం అధికారి విష్ణుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొల్లాపూర్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్, పాఠ్యపుస్తకాల పేరుపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలను తీసుకుంటున్న పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మూసివేసిన 8624 పాఠశాలలు పునఃప్రారంభించాలని, ఎంఈవో పోస్టులు తక్కువగా ఉండడం వల్ల ఒక ఎంఈవో పలు మండలాలకు ఇన్‌చార్జిగా ఉంచడం ద్వారా విద్యావ్యవస్థ పర్యవేక్షణలోపం జరుగుతుందని, రెగ్యులర్ ఎంఈవోను నియమించాలని పేర్కొన్నారు.

యువతి మృతిపై కేసు నమోదు

చారకొండ, జూన్ 8: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన ఆలేటి సైదమ్మ, రవిలకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుతూరు ఆలేటి మమత (18)గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ కళ్లు తిరిగి కింద పడిపోవడంతో చికిత్సకోసం కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మమతకు కడుపులో ఇన్‌ఫెక్షన్ అవ్వడంతో మెరుగైన చికిత్సకోసం కుటుంబ సభ్యులు కల్వకుర్తిలోని ఆదే ఆసుపత్రికి చెందిన హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు ఏమయిందని అడగడంతో కళ్లు తిరిగి కింద పడిపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మమత చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. చారకొండ పోలీస్‌స్టేషనల్‌లో కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా మెడికోల్ లీగల్ కింద కేసు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. మమత మృతదేహానికి ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబులు శ్రీనివాసులు తెలిపారు.

తీన్మార్ మల్లన్న విజయంపై సంబురాలు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 8: నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు బాణ సంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు, జేఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జమ్ముల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా కాంగ్రెస్ పార్టీదే విజయమన్నారు. ప్రజా గొంతుకగా గత ప్రభుత్వంతో పోరాడి ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపుతో యావత్ తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్, కౌన్సిలర్ నిజాముద్దీన్, నాయకులు తైలి శ్రీనివాసులు, కేశవులు పాల్గొన్నారు.

రేపు తైబజార్ వేలం పాట

తిమ్మాజిపేట, జూన్ 8 : తిమ్మాజిపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఈ నెల 10న సంత తైబజార్ వేలం పాట ప్రత్యేక అధికారిణి ఎంపీడీవో లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రరావు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంత తైబజార్ వేలం పాటలో పాల్గొననున్నవారు పదివేల రూపాయల డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.


15 నుంచి శ్రీరంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

కందనూలు, జూన్ 8 : జిల్లాలోని అత్యంత పురాతన వైష్ణవ ఆలయాల్లో ఒకటైన శ్రీపురం శ్రీరంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 15 నుంచి జూన్ 18దాకా నిర్వహించనున్నారు. శనివారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ఆవిష్కరించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జూన్ 15న స్వామి వారికి అభిషేకం, తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, రక్షాబంధనం, అంకురార్పణ, జూన్ 16న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, గరుడ ముద్ద, భేరీ పూజ, దేవతాహ్వానం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. జూన్ 17న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీగోదాం రంగనాథస్వామి తిరుకల్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నామని, జూన్ 18న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ద్వాదశరాధన, ధ్వజా అవరోహణ, కుంభ ప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు చంద్రనారాయణ, వరదయ్య, ప్రసాద్, ఆలయ అర్చకులు వినోదాచార్యులు, శేఖర్ రెడ్డి, మాధవరెడ్డి, అంజి, మల్లికార్జున్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



బడిబాట సందర్భంగా విద్యపై ప్రజలకు అవగాహన ర్యాలీ

ఉప్పునుంతల, జూన్ 8 : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నామని హెచ్ఎం లక్ష్మీ నారాయణ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఉప్పునుంతలలోని బాలుర పాఠశాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలమణి, వెంకటేస్, అంగన్‌వాడీ టీచర్ పద్మమ్మ, నాయకుడు రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: బడి ఈడు గల పిల్లలను బడిలో చేర్పించాలని చంద్రకల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని చంద్రకల్ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని చెప్పారు. ఉపాధ్యాయులు నిరంజన్, సీఆర్పీ రమేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలుపర్చాలి



ఎంఈవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొల్లాపూర్, జూన్ 8 : విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం పేద విద్యార్థులకు విద్యనందించాలని బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు బి.శేఖర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.దాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని ఎంఈవో కార్యాలయం అధికారి విష్ణుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లాపూర్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాల పేరుపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలను తీసుకుంటున్న పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 25శాతం పేద, మధ్య తరగతి విద్యార్థులకు సీట్లు కేటాయించాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఎక్కడా అమలుపర్చడం లేదన్నారు. అమలుపర్చని పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. వెంటనే జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు శేఖర్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.దాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా శనీశ్వర స్వామికి తిల తైలాభిషేకాలు



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూన్ 8 : మండలంలోని నంది వడ్డెమాన్‌లోని సార్థా సప్త జేష్టదేవి సమేత శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నల్లని నువ్వులు, తిల తైలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ జన్మ, గోచార రీత్యా గ్రహదోషాలు ఉన్న వారు ఏలినాటి శని, అర్ధాష్టమి శని, అష్టమ శని గ్రహ బాధలు తొలగుటకు శనీశ్వర స్వామికి తిల తైల అభిషేకాలు, బ్రహ్మ సూత్రం ఉన్న పరమ శివుడికి రుద్రాభిషేకాలు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచి శనీశ్వర స్వామిని, బ్రహ్మ సూత్రం ఉన్న పరమశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటి సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, ఆలయ సహాయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రామోజీరావు మృతి తీరని లోటు



రామోజీరావు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న జర్నలిస్టులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 8: ఈనాడు మీడియా సంస్థల అధినేత రామోజీరావు మృతి జర్నలిస్టు సమాజికి తీరని లోటని సీనియర్ జర్నలిస్టు మహ్మద్ అబ్దుల్లాఖాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రామోజీరావు చిత్ర పటానికి జర్నలిస్టులు ఘన నివాళులు అర్పించారు. సీనియర్ జర్నలిస్టులు జెమిని సురేష్, సురేష్‌రావు, చంద్రశేఖర్‌రావు, అహ్మదుల్లాఖాన్, సత్యం, ఉమాశంకర్, జర్నలిస్టులు యాదయ్య, సాజిద్, శ్రీనివాస్‌గౌడ్, పరమేష్, సాదిక్, మల్లేష్, సి.వెంకటస్వామి, రమేష్, శ్రీను, బాలస్వామి, మల్లేష్, శేఖర్, జాకీర్, రబ్బానీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: పత్రిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన 'ఈనాడు' సంస్థల అధినేత రామోజీ రావు అస్తమయం కావడంతో శనివారం జర్నలిస్టులు ప్రగాఢ సంతాపం తెలిపి ఘనంగా నివాళ్లు అర్పించారు. మండలంలోని ప్రెస్‌క్లబ్‌లో రామోజీ రావు చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించి పత్రిక రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయా పత్రికల విలేకర్లు ఉన్నారు.

● తెలకపల్లి: రామోజీరావుకు వివిధ పార్టీల నాయకులు ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఆయన పత్రికా రంగానికి, టెలివిజన్ రంగానికి చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ ఘన నివాళులర్పించారు. మామిళ్లపల్లి యాదయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్లు అప్పగింత

చారకొండ, జూన్ 8: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన సురేష్, మల్లేష్‌లతో పాటు ఆమనగల్ మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన రమేష్‌లు గత ఏప్రిల్ లో జరిగిన సిర్సన గండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. దీంతో బాధితులు చారకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ వారియర్ ఆంజనేయులు వారి సెల్‌ఫోన్ నెంబర్లను ట్రెస్ చేసి ఫోన్లను రికవరీ చేశారు. శనివారం వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో బాధితులకు ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా సైబర్ వారియర్ ఆంజనేయులును సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ లు అభినందించారు.

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న దృశ్యం

కొల్లాపూర్, జూన్ 8 : జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా 18 కేసులు, ఎక్సైజ్ 28 కేసుల్లో అపరాధ రుసుము విధించి పరిష్కరించినట్లు చైర్మన్ శ్రీనిధి, సభ్యులు ఆర్ కురుమూర్తి, కే.మోహన్‌లాల్ తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలోని కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయాధికారి ఆదేశాలతో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టి చలాన్ కేసులు మొత్తం 1710 కేసుల్లో అపరాధ రుసుం విధించి కేసులను తీసివేశారు. మూడు సైబర్‌క్రైమ్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్‌అదాలత్ కర్నె శ్రీహరి, అధ్యక్షులు రామలక్ష్మమ్మ, పి.గోవిందు, భాస్కర్‌రెడ్డి, రాజేష్, మనోహర్, ఏపీపీ బి.శిరీష. సీఐ కే.మహేష్, కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి పోలీస్ కానిస్టేబుల్స్, కోర్టుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తిటౌన్: మెగా లోక్‌అదాలత్‌లను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి, జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్య అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించి మాట్లాడారు. కక్షిదారులు ఇరువురు ఒక అంగీకారానికి వచ్చి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్ ద్వారా మొత్తం 1207 కేసులను పరిష్కరించినట్లు వివరించారు. 19 పోలిసుకేసుల్లో రాజీ పడ్డారని, 86 పోలీస్ కేసుల్లో నిందుతులు నేరాన్ని అంగీకరించి రూ.2.69 లక్షలు జరిమానా చెల్లించారని, 1121 కేసుల్లో డ్రంక్ అండ్‌డ్రైవ్ కేసుల్లో నిందితులు జరిమానాలు చెల్లించారని వారు వివరించారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున, కల్వకుర్తి, ఊర్కొండ ఎస్ఐలు మాధవరెడ్డి, వీరబాబు, న్యాయవాదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన న్యాయాధికారులు

ప్రతీ ఒక్కరు మొక్కలను పరిరక్షించాలని కల్వకుర్తి సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి, జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్య అన్నారు. శనివారం జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు ఆవరణలో వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. సీఐ నాగార్జున, కల్వకుర్తి, ఊర్కొండ ఎస్సైలు మాధవరెడ్డి, వీరబాబు, నాయ్యవాదులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో అవకతవకలపై దర్యాప్తు చేయాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ కాంగ్రెస్ నాయకుడు కర్ణబాబు

అచ్చంపేటటౌన్, జూన్ 8: నీట్ ఫలితాల్లో అవకతవకలపై దర్యాప్తు చేయడానికి ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి పునఃనిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ కాంగ్రెస్ నాయకుడు కర్ణబాబు అన్నారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 67మందికి 720 మార్కులు వచ్చాయని, పలువురికి 718, 719 మార్కులు వచ్చాయని, మైనస్ మార్కుల విధానంలో ఇది సాధ్యం కాదన్నారు. నీట్ యూజీ 2024 పరీక్షలో అవకతవకల ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అవకతవకల ఆరోపణలు నిజమని తేలితే 2024 నీట్ యూజీ పరీక్షను పునఃనిర్వహించాలన్నారు. అలాగే విద్యార్థులకు తగిన న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్ లాల్, బాబు, సురేష్, భీమా, రాజేందర్, సాదిక్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

కొల్లాపూర్, జూన్ 8 : దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బల్మూల ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మే 5న నీట్ పరీక్ష నిర్వహించగా, దాదాపు దేశ వ్యాప్తంగా 24లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, సాక్ష్యాలుగా ఆరుగురు విద్యార్థులకు 720మార్కులకు గాను 720మార్కులు రావడంతో వారంతా ఒకే పరీక్ష కేంద్రంలో రాయడం అనేక అనుమానాలకు తావిస్తుందని ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కొల్లాపూర్, జూన్ 8 : కొల్లాపూర్ పట్టణానికి చెందిన చాకలి రవి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొల్లాపూర్ నియోజకవర్గ నందమూరి అభిమాన సంఘం సభ్యులు శనివారం చాకలి రవి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. సినిమా హీరో నందమూరి వీరాభిమానిగా ఉన్న చాకలి రవి మృతి తీరని లోటని బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి ఎల్లప్పుడు తమకు అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు రాజలింగం, లక్ష్మయ్యగౌడ్, ఖాదర్, లెజెండ్ భాస్కర్, గోపి, శివ పాల్గొన్నారు.

'సీఎంపై ఆరోపణలు సహించేది లేదు'

వంగూరు, జూన్ 8: మహబూబ్‌నగర్ ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ఓట్లు వేయించారని, సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో కూడా అలాగే చేయించారని సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు బీఆర్ఎస్ నేత ఎర్రోల శ్రీనివాస్ ఆరోపించడం తగదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులిజాల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి గడిచిన ఆరు నెలల్లో ఆరు గ్యారంటీలకు అయిదు గ్యారంటీలను అమలు మాట నిలబెట్టుకున్నారని అన్నారు.

యూనిఫామ్స్ పంపిణీ

తిమ్మాజిపేట, జూన్ 8 : తిమ్మాజిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని చదివే విద్యార్థులకుగాను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు శనివారం మహిళా సమాఖ్య భవనంలో ఎంఈవో శ్రీనివాసులు యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన ఏకరూప దుస్తులను స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలోకి సంబంధిత పాఠశాలలకు అందజేశారు. ప్రస్తుతం 21 పాఠశాలల్లో చదివి 870 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీఎం శ్రీహరి, పాఠశాలల హెచ్ఎంలు,మహిళా సమాఖ్య నాయకురాలు సీసీలు పాల్గొన్నారు.

● కోడేరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఐకేపీ ఏపీఎం పార్వతమ్మ సీఆర్పీలు పరిశీలించారు. శనివారం మండల కేంద్రంలోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసే ఏకరూప దుస్తులు మండల సమాఖ్య సిబ్బందితో పాటు సీఆర్పీలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం పార్వతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. సీఆర్పీలు సాయికుమార్ విజయలక్ష్మి మాట్లాడారు. ఏపీఎం పార్వతమ్మ, సీఆర్పీలు నాజియా, నాయక్, సాయికుమార్, విజయలక్ష్మీ, కంప్యూటర్ ఆపరేటర్ నాగేంద్రం, టైలర్లు ఉన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

తిమ్మాజిపేట, జూన్ 8 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు సవాలు అనే అంశంపై ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందర విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఉపాధి హామీ పథకం మండల మేటుల సంఘం నాయకుడు మూడావత్ నాగరాజు అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆయన శనివారం మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలో కొన్నేళ్లుగా మేట్‌లుగా పని చేస్తున్న తమను పట్టించుకోవడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలి

కల్వకుర్తిటౌన్, జూన్ 8 : వర్షాకాలంలో విద్యుత్తు తీగలు, విద్యుత్తు స్తంభాలతో జాగ్రత్తగా ఉండాలని విద్యుత్తు ఏడీ చంద్రశేఖర్‌రావు, ఏఈ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ముందు, ఇందిరానగర్ కాలనీ, సివిల్ కోర్టు ముందు, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ బస్‌డిపో ముందు విద్యుత్తు తీగలను అల్లుకొని ఉన్న మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. వార్డు కౌన్సిలర్ సైదుల్‌గౌడు, లైన్‌మెన్‌లు లక్ష్మణ్, జలీల్, బాలకిష్టయ్య, ఇతర సిబ్బంది పరశురాములు, శాంతయ్య, పాండు, రాజేష్, హాజీ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి'

కల్వకుర్తిటౌన్, జూన్ 8 : పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, బీసీ సబ్‌ప్లాన్ నియోజకవర్గ నాయకుడు రమేష్‌చారి, సీపీఎం జిల్లా నాయకుడు ఏపీ మల్లయ్య మాట్లాడారు. శనివారం పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడి వారికి న్యాయం చేయాలని కోరారు. గత సంవత్సరం క్రితం లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారని, ఇప్పటి వరకు డబుల్‌బెడ్ రూంలను అందజేయలేదని వారు విమర్శించారు. లబ్ధిదారులు శ్రీనివాసులు, భాగ్యమ్మ, జయమ్మ, వెంకటచారి, పార్వతమ్మ, సువర్ణ, అంజనమ్మ, నరసింహ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.